# విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 20 జూన్ 2025 8 పేజీలు

## తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ఉచిత బస్సులు

- ప్రారంభించిన అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమలలో భక్తులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీటీడీ అదనపు ఈవో

2లో

# మామిడి రైతులు ఆందోళన చెందొద్దు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం - సిఫార్సులు,దళారీ వ్యవస్థ ఉండదు

- ఎట్టికేలకు ప్రత్యేక అధికారుల నియామకం

- సమస్య ఉంటే నన్ను కలవండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,గుజ్జు పరిశ్రమల్లో ఇబ్బందులు లేకుండా అమ్ముకునే పరిస్థితి కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు.గురువారం జిడినెల్లూరు జైన్ గుజ్జు ఫ్యాక్టరీ వద్ద రైతులు,పరిశ్రమ యాజమాన్యం తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడి పంట తీసుకొచ్చే రైతులు పరిశ్రమల వద్ద ఇబ్బందులు పడకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తామని అన్నారు.మామిడి వాహనాలు క్యూ లో నిరీక్షించే సమయంలో రైతులకు తాగునీరు,నీడ,చిరుతిండ్లు పంపిణీ వంటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.ఇక నుంచి ప్రజాప్రతినిధులు, దళారీల సమస్య ఉండదని క్యూలైన్ పద్ధతిలోనే కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.ఈ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లో భాగంగా డిఆర్డీఏ పిడీ శ్రీదేవి ని ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో

మహిళల రక్షణ, హక్కుల కోసం..

# మహిళా కమిషన్ కృషి

- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డా. అర్చన మంజుదార్

మహిళలు సమస్యలను పరిష్కర దిశగా

జాతీయ మహిళా కమిషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుంది

- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

మహిళా కమిషన్ న్యాయం చూపుతుంది: ఎస్పీ హర్షవర్ధన్ రాజు

వార్త 2వ పేజీలో

తోతాపూరి మామిడి రైతులకు

# తక్కువ ధర చెల్లిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

రైతులకు తక్కువ ధర చెల్లిస్తున్న రెండు రాంపుదారులపై కేసు పెట్టించిన కలెక్టర్

అన్ని రాంపుల వద్ద విఆర్ఓ లను, పోలీస్ కానిస్టేబుల్ లను ఉంచండి

మామిడిరైతులకు ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 0877 2236007 నకు ఫోన్ చేయండి

విశాలాంధ్ర - పాకాల : తోతాపురి మామిడి రైతులకు తక్కువ ధర చెల్లించే రాంపు దారులపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ రాంపు దారులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం దామల్ చెరువు వద్ద గల రాంపులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాంపుల వద్ద ఉన్న రైతులతో ర్యాంపుదారులు చెల్లిస్తున్న ధరలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. రాంపుదారులు తమ వద్ద నుంచి కేజీ మూడు రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు వెంటనే రైతుల వద్ద ఫిర్యాదు తీసుకొని రాంపుదారులపై పోలీస్ కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అక్కడే ఉన్న సి ఐ ని ఆదేశించారు.అంతేకాక తానే దగ్గరుండి ఫిర్యాదును రాయించి జిల్లా కలెక్టర్ రైతులతో సంతకం చేయించారు. వెంటనే సోలాపూర్ రాంపుదారిపై దారునిపై చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని ఆదేశించారు. ఇకపై ఏ ర్యాంపుదారుడు కూడా కనీసం

వార్త 2లో

## రైతులు ఆందోళన చెందొద్దు

**(మొదటి పేజీ తరువాయి)** అంతేకాకుండా ఆయా జిల్లా పరిధిలో ని గుజ్జు పరిశ్రమ లో స్థానిక ఎంపిడిఓ, తహశీల్దార్ లు కూడా పర్యవేక్షణ అధికారులు గా ఉంటారన్నారు.ౖతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.ఇంకా ఏదైనా సమస్య ఉంటే తనను నేరుగా కలిసి పిర్యాదు చేయొచ్చన్నారు.ఫ్యాక్టరీ యాజమాన్యాలు కూడా క్యూలైన్ పద్ధతి పాటించి మాత్రం రైతుల నుంచి కొనుగోలు చేయాలని అన్నారు.యాజమాన్యం రైతులతో ఒక వాట్సఅప్ గ్రూప్ పెట్టి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అన్నారు.మామిడి రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాల్సిన బాధ్యత నియమించిన అధికారులదే అని ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతులు,మామిడి పరిశ్రమ యాజమాన్యం,అధికారులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ ఉచిత బస్సులు

**(మొదటి పేజీ తరువాయి)** సి.హెచ్ .వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఉదయం ఆర్టీసీ బస్సుల ఉచిత ట్రిప్పులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తిరుమలలో ప్రైవేట్ వాహనాలు భక్తుల నుండి వసూలు చేస్తున్న అధిక ఛార్జీలను అరికట్టడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు త్వరితగతిన బస్సులను ఉచితంగా తిప్పేందుకు ముందుకు రావడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు తిరిగే మార్గంలోనే ఈ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని చెప్పారు.ఈ ఉచిత ట్రిప్పుల ద్వారా భక్తులకు, ఆర్టీసీకి అదనపు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే టీటీడీ శ్రీవారి ధర్మ రథాల ద్వారా తిరుమలలో ప్రతిరోజూ 300 ట్రిప్పులను తిప్పుతోందని చెప్పారు. ఆర్టీసీ బస్సులు తోడవ్వడంతో అదనంగా 80 ట్రిప్పులు తిప్పేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ప్రతి రెండు నిమిషాలకు బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతమవ్వడంతో పాటు బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.భక్తులు బస్టాండ్ వద్దకు రాకుండా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఈ ఆర్టీసీ బస్సులను ఎక్కడం ద్వారా నేరుగా తిరుపతికి వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. తిరుమలలో ఏ ప్రాంతంలో బస్సు ఎక్కినా తిరుమల నుండి తిరుపతికి మాత్రమే ఛార్జీలు ఉంటాయని, ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా ఉచితంగా ఈ సర్వీసులను భక్తులు వినియోగించుకోవాలని ఆయన భక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్, టీటీడీ ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవో లోకనాథం, తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరావు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథ్, డిప్యూటీ సీఎంఈ, బాలాజీ, అలిపిరి డిపో మేనేజర్ శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహిళా కమిషన్ కృషి

**విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ :** మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం మహిళా కమిషన్ కృషి చేస్తుందని, మహిళల రక్షణ కోసం 24 గంటలు హెల్ప్ లైన్/ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదారి తెలిపారు. గురువారం తిరుపతి కలెక్టరట్ లోని సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్, మహిళా జన్ సున్వై అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు తో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పి హర్ష వర్ధన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు మహిళల భద్రత, వారి హక్కుల ను కాపాడటం గురించి మాట్లాడుతూ మహిళలు రక్షణ వారి హక్కుల పరిరక్షణ కోసం మహిళా కమిషన్ కృషి చేస్తుందని, మహిళల రక్షణ కోసం 24 గంటలు మహిళా కమిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాధితులు ఏ సమయంలోనైనా తమకు ఫిర్యాదు చేయవచ్చని తక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. తమ సమస్యలను హెల్ప్ లైన్/ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు. జిల్లాలో మహిళలకు సంబంధించిన కేసును పరిష్కరించడానికి ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సమస్యలను పరిష్కరించే దిశగా జాతీయ మహిళా కమిషన్ జిల్లాకు రావడం జరిగింది తెలిపారు. 8 జిల్లాలకు గ్రీవెన్స్ కు సంబంధించిన మహిళా జన్ సున్వై ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి మహిళా కమిషన్ అప్పటికప్పుడే స్పందిస్తుందని అన్నారు. మహిళలు తమ సమస్యలను ఏ సమయంలో అయినా హెల్ప్ లైన్/ మెయిల్ ద్వారా తెలపవచ్చని, ఈ విషయంలో జిల్లా యంత్రాంగం తరపున అడ్మినిస్ట్రేషన్, పోలీస్ శాఖ టేక్ అప్ చేసి విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ప్రతి సమస్యను వ్యక్తిగతంగా తీసుకొని పరిష్కారం చూపేలా మహిళా కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారు సమస్యలను నేరుగా తెలుపవచ్చు అన్నారు. జాతీయ కమిషన్, బృందం సమస్యలను విని ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ఎలా సమస్యలను పరిష్కరించాలి అనే దిశగా అర్జీలదారులకు పరిష్కారం చూపుతారని అలాగే వారికి త్వరగా న్యాయం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం,కడప జిల్లాల పోలీస్ శాఖ సిబ్బంది, రోఖాయ బేగం మెంబర్, అడ్వకేట్ లు కంచి శ్యామల, కోమలాదేవి శారద, నేశమ చౌదరి, చంద్రశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి వసంత బాయి, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ధర చెల్లిస్తే చర్యలు

**(మొదటి పేజీ తరువాయి)** నాలుగు రూపాయలు కి తగ్గకుండా తోతాపురి మామిడి కాయలను కొనుగోలు చేయాలని అలా చేయకుంటే వారి రాంపులను సీజ్ చేసి కేసులు బుక్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రాంపు వద్ద విఆర్వోలను పోలీస్ కానిస్టేబుల్ ను తప్పనిసరిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు తక్కువ ధర చెల్లించకుండా చూడాలన్నారు. అనంతరం దామల చెరువులోని జి ఎస్ కే సి ఎం ఎన్ రాంపును పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులు రాంపుదారుడు కొంతమంది ట్రేడర్స్ తో కలిసి సిండికేట్ గా మారి టన్నుకు 25 కేజీలచొప్పున సూట్ ను కూడా రైతుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎవరు కూడా రైతుల నుంచి సూట్ ను వసూలు చేయరాదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.రాంపు నుండి నేటి ఉదయంమామిడికాయలను తోలిన రైతు ఎం భాస్కర్ రెడ్డితో జిల్లా కలెక్టర్ ఫోన్ లో మాట్లాడి ఏ ధరకు మామిడికాయలను అందజేశారు తెలుపమని కోరగా వారు కేజీ మూడు రూపాయలు చొప్పున మామిడికాయలను అమ్మడం జరిగిందని కలెక్టర్ కు తెలిపారు.వెంటనే జి ఎస్ కే సి ఎం ఎన్ రాంపుయజమాని పై కూడా జిల్లా కలెక్టర్ కేసును నమోదు చేయించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి చివరి మామిడికాయ వరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కేజీకి నాలుగు రూపాయలు చొప్పున సబ్సిడీని అందజేస్తుందని ఆ మొత్తాలను రైతుల ఖాతాలకు నేరుగా జమచేస్తుందన్నారు.ఎక్కడ కూడా ప్రభుత్వం ఎకరాల పరిమితి విధించలేదని, రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంత పంటను జిల్లాలోని పల్ప్ ఇండస్ట్రీలకు అందించవచ్చని తెలిపారు. తోతాపూరి మామిడికాయ రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 0877 2236007 నకు ఫోన్ చేసి తెలపాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు.అంతకుముందు పాకాల మండలం,రామిరెడ్డి ఇండ్లు గ్రామం, ఉప్పరపల్లి గ్రామపంచాయతీలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు అక్కడే ఉన్న రైతుల తో మాట్లాడారు. ముందుగా వచ్చిన వారికి ముందుగా టోకెన్ జారీ చేయాలని అలాగే వారి పేరు వారి ఊరు వారి ఫోన్ నెంబర్ తదితర వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఎక్కడ కూడా డూప్లికేషన్ లేకుండా చూడాలని ఉద్యాన మన సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు అక్కడే ఉన్న కంప్యూటర్లో నమోదు చేసిన రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామి రెడ్డి, తహసిల్దార్ సంతోష్ సాయి, హార్టికల్చర్ అధికారిణి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# ఏమిటీ సాగదీత.. మోక్షం ఎప్పుడు!

- కార్ పార్కింగ్ లీజు కేటాయింపులో జాప్యం
- టెండరు జరిగినా నిర్వహణకు రాని ఆర్డర్
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు
- మంత్రి అనుమతి కోసం పెండింగా
- ముక్కంటి చెంత ఇదీ పరిస్థితి

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే ఆలోచనతో కార్ పార్కింగ్ లీజుకు టెండరు నిర్వహించారు. గత కొన్నేళ్లుగా టెండర్లు తక్కువ మొత్తంలో కోట్ చేస్తూ కాంట్రాక్టర్లు టెండర్లు వేయడంతో రద్దు చేస్తూ వచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పిలిచిన టెండర్లలో ఆశించిన మేరకు టెండర్లు రావడంతో ఖరారు చేసి కాంట్రాక్టరు వద్ద అందుకు సంబంధించిన సొమ్ములు కూడా దేవస్థానం చెల్లించుకుంది. టెండర్ నిబంధనల మేరకు కార్ పార్కింగ్ నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టరుకు అప్పగించాల్సి ఉంది. ఆ మేరకు అమోదానికి దేవాదాయ శాఖ కార్యదర్శి వద్దకు వెళ్లిన ఫైలుకు మాత్రం మోక్షం లభించ లేదు. ఇక్కడి అధికారులు ఈ నెల ఒకటో తేదీనే లీజు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పినా కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతులు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సొమ్ము చెల్లించిన కాంట్రాక్టర్ ఆలయ పరిపాలనా భవనం చుట్టు తిరుగుతూ చేసిన అప్పులకు వడ్డీలు ఏలా చెల్లించాలో తెలియక లబోదిబోమంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి కార్ పార్కింగ్ ద్వారా ఆశించిన మేర ఆదాయం సమకూరుతోంది. గత వైసీపీ హయాంలో తక్కువ మొత్తంలో టెండర్లు దాఖలు కావడంతో ఖరారు కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్ పార్కింగ్ టెండర్లు పిలిచారు. దేవస్థానం ఆశించిన మేరకు టెండరు దాఖలు కావడంతో సదరు కాంట్రాక్టరు నుంచి నిబంధనల మేరకు లీజుకు సంబంధించి రూ. 1.1కోట్లు డిపాజిట్టుగా చెల్లించాలని అధికారులు సూచించారు. ఆ మేరకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆ మొత్తం దేవస్థానికి చెల్లించారు. ఈ నెల ఒకటో తేదీన లీజు నిర్వహణకు బాధ్యతలు అప్పగిస్తామని అధికారులు కాంట్రాక్టరకు సొమ్ములు చెల్లించే సమయంలో చెప్పారు. ఆ మేరకు టెండరు అమోదానికి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి ఫైల్ పంపించారు. కానీ రోజులు గడిచినా ఆ ఫైలుకు మాత్రం మోక్షం లభించ లేదు. దానికితోడు ఫైలు కదలక పోవడానికి గల కారణాలు కూడా ఇక్కడి అధికారులు చెప్పలేని పరిస్థితి. దీంతో నిత్యం టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు దేవస్థానం పరిపాలనా భవనంలోని అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కానీ వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అప్పులు చేసి చెల్లించిన డిపాజిట్టుకు వడ్డీలు చెల్లించే మార్గం కనిపించకుండా లబోదిబోమంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొన్ని రాజకీయ కారణాలతో ఈ ఫైలు కదలకుండా ఉందనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత వైసీపీ హయాంలో టెండర్లు ఖరారు కాకుండా ఆలయ ఆదాయానికి గండి పడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో టెండరు ఖరారు అయినా రాజకీయ శక్తుల ప్రమేయంతో వచ్చే ఆదాయానికి బ్రేకులు పడ్డాయని చెబుతున్నారు. ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల జోక్యంతోనే కార్ పార్కింగ్ టెండరు అమోదంలో జాప్యం జరుగు తోందనే ప్రచారం సాగుతోంది. మరోపక్క ఓ మంత్రి అనుమతి కోసం కూడా ఈ ఫైలుకు అమోదం లభించ లేదని చెబుతు న్నారు. ఇదిలా ఉంటే.. ఒక పక్క స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పలు సంస్కర ణలను ప్రవేశపెట్టి ఆలయ ఆదాయం గణనీయంగా పెంచడంలో సఫలీకృతులయ్యారు. భక్తుల సౌకర్యాలకు

పెద్దపీఠ వేసి ప్రశంసలం దుకున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించి అందరిచేత శభాష్ అని పించుకు న్నారు. ఆ తర్వాత కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ పరిస్థితిలో ఆలయానికి పెరిగిన భక్తుల తాకిడి, పలు విభాగాల్లో పెరిగిన పని ఒత్తిడితో సిబ్బంది కొరత వెంటాడుతోంది. అవసరమైన సిబ్బంది అందుబా టులోనున్నా వారు కార్ పార్కింగ్ ఫీజులు వసూళ్లలో విధులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో అందు బాటులో సిబ్బంది ఉన్నా భక్తుల అవసరాల నిమిత్తం ఆలయంలో ఉపయోగించు కోలేని పరిస్థితి నెలకొంది. పార్కింగ్ టెండరుకు అమోదం తెలిపితే ఆ బాధ్యతలు కాంట్రాక్టరు నిర్వహణకు వెళుతుంది. అప్పుడు ప్రస్తుతం ఆ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఆలయంలో కొరత ఉన్న చోట ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ ఎందుకో టెండరు అమోదంలో సాగదీత మాత్రం కొనసాగుతోంది. ఇప్పటికైనా ఓ నిర్ణయానికి వచ్చి ఆలయ ఆదాయానికి గండిపడకుండా టెండరు నిర్వహణలో ప్రకటించిన నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. తద్వారా ఆలయంలో భక్తుల అవసరాల నిమిత్తం ఏర్పడిన సిబ్బంది కొరత కూడా తీరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారుల నిర్ణయం మరి ఏలా ఉంటుందో వేచిచూడాల్సిందే.

## ముగిసిన సుందరరాజస్వామి అవతార మహోత్సవాలు

**విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మ వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు 16వ తేదీ నుంచి 19వరకు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు గురువారం అవతార మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో వైభవంగా అభిషేకం నిర్వహించారు. స్వామి వారి అభిషేకంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణస్వామివారి ముఖమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై దర్శనమిస్తూ ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, విఐ రాము, ఇన్స్పెక్టర్లు సుబ్బారాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు, అర్చకులు బాబు స్వామి ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## యస్వీయూ స్టేడియంలో యోగాంధ్ర

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోజూన్ , 21 వ తేదీన జరుగనున్న యోగాంధ్ర - 2025 కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం , 21 ఉదయం 5.45 గంటల నుంచి 7.15 వరకు యస్వీయూ తారకరామ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందని, యూనివర్సిటీ నుంచి 3 వేల మంది, తిరుపతి జిల్లా కలెక్టరు వారి పక్షాన 4 వేల మంది , దాదాపు 7 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి యస్వీయూ ఉపకులపతి, తిరుపతి జిల్లా కలెక్టర్ , తదితర పరిపాలన యంత్రాంగం హాజరవుతున్నారని, అందరూ ఒకే విధమైన టీ షర్టులు ధరించి, కార్యక్రమంలో పాల్గొంటారని, యస్వీయూ గ్రౌండ్ లో మొత్తం కార్పెట్లతో సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఈ యోగా కార్యక్రమంలో నలుగురు ప్రధాన వ్యాయామ నిపుణులు, ఆరు మంది సహాయకులు సిద్ధంగా వున్నారని , విశ్వవిద్యాలయంలో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్మెంట్, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గత నెల 21 నుంచి శిక్షణ తరగతులు క్యాంపస్ లోని అన్నమయ్య భవన్ ,బాస్కెట్ బాల్ కోర్టు తదితర ప్రాంతాల్లో జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమం డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించడం జరుగుతుందని, విశ్వవిద్యాలయంలోని ప్రతి విద్యార్థి, ఉద్యోగులు పాల్గొంటారని వారు తెలియజేశారు.

## ముక్కంటిసేవలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏఈఓ మోహన్, ఏపీఆర్ఓలు శేఖర్, కిరణ్, తదితరులు, పాల్గొన్నారు.

## ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురు వారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణా మూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం శ్రీకాళహస్తిలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. రాహుల్ గాంధీ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, ఆంటోనీ, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవోకు శివ ప్రకాష్ రాజు ఘన సన్మానం

విశాలాంధ్ర - పాలసముద్రం: పాలసముద్రం నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన సతీష్ కుమార్ ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమిటీ చైర్మన్ శ్యామల శివప్రకాష్ రాజు గురువారం నాడు స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని మీ అధికారాలను వినియోగించుకోవడానికి పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని ఎటువంటి పక్షపాతాలు ఇక్కడ లేవని ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆయనను కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## విద్యను వ్యాపారం చేస్తున్నటువంటి శ్రీ చైతన్య విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలి

### ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిప్రవీణ్ కుమార్ , రాష్ట్ర సమితి సభ్యులు మున్నా

విశాలాంధ్ర - పుంగనూరు: స్థానిక పుంగనూరు నియోజకవర్గ పుంగనూరు పట్టణంలో ఉన్నటువంటి శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో విద్యార్థుల దగ్గర నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ యూనిఫామ్ టెక్స్ బుక్స్ షూలు టై బెల్ట పేరులతో విద్యార్థుల దగ్గర నుండి లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తూన్నారని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి అంతులేకుండా పోయిందన్నారు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తా ఉన్నప్పటికీ ఎక్కడా కూడా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయన అన్నారు విద్యాశాఖ అధికారులు తీరు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఈ విధంగా ఫీజులు దోపిడీ జరుగుతున్నప్పటికీ ఎందుకు వారు నోరు మెదడుపడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడా కూడా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పైన రైట్స్ నిర్వహించి వారి మీద చర్యలు తీసుకున్న దాఖలు లేవు జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ యంత్రాంగం మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు.ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో వారి దగ్గరే టెక్స్ట్ బుక్కులు యూనిఫామ్ లు టై ఈ బెల్టు వంటివి తీసుకోవాలని పాఠశాల క్యాంపస్ లోనే ఒక స్టోర్ ని మెయింటైన్ చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తా ఉన్నాయన్నారు.సరైనటువంటి వసతులు లేనప్పటికీ విద్యార్థుల దగ్గర నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ సరైనటువంటి విద్యను అందించకుండా విద్యను వ్యాపారం చేస్తున్నటువంటి శ్రీ చైతన్య కార్పొరేట్ స్కూల్స్ పైన వెంటనే చర్యలు తీసుకొని ఈ విధంగా విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తా ఉన్నటువంటి పాఠశాలల పైన వెంటనే చర్యలు తీసుకొని ఆ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. అనంతరం పుంగనూరు మండల విద్యాశాఖ అధికారి కి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నా పుంగనూరు నియోజకవర్గ నాయకులు గోపీచంద్,హుస్సేన్, గిరిధర్, శేఖర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనచే పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పెళ్లిమండపం వద్ద పేదలకు అన్నదానం చేశారు. డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంలో భాగంగా 49వ రోజు ఈ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి శివకుమార్, తోట గణేష్, రవి కుమార్ రెడ్డి, జ్యోతీ రామ్, సురేష్, వెంకటరమణయాదవ్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, మాలతి, దినేష్, ఉదయ్, సాయి, వినోద్, అశోక్, బీయస్ యస్ దుమ్మురాయల్,బీయస్యస్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో నేనున్నాంటూ.. పెద్ద కొడుకులా సీఎం

### - ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ప్రతి పేద కుటుంబానికి ఆపదలో నేనున్నాంటూ సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రి సహాయానిధి అందజేస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలువురికి రూ.24,62,489 చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాట్లా డుతూ ప్రతి పేద కుటుంబనికి పెద్దకుమారుడులా సీఎం చంద్రబాబునాయుడు ఉన్నారన్నారు. అనారోగ్య కారణల వల్ల ఆస్పత్రిలో చికిత్సలు పొందిన ప్రతి పేద కుటుంబానికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత చాలామంది పేదవారికి సీఎం సహాయనిధి ఇప్పించామన్నారు. ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తనను సంప్రదించవచ్చని తెలిపారు. నియోజయ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, రూరల్అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్, తొట్టంబేడుమండ లాధ్యక్షుడు మునిరాజానాయుడు, రేణిగుంట రూరల్, పట్టణాధ్యక్షుడు చంద్రారెడ్డి, మహబూ బ్బాషా, ఏర్పేడు మండలాధ్యక్షుడు నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన సి.కే. కార్తికేయన్

విశాలాంధ్ర - పుత్తూరు : పుత్తూరు మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ సి కే. కార్తికేయన్ ఏపీసీసీ అధ్యక్షురాలు వై ఎస్. షర్మిల రెడ్డి సమక్షంలో, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్తికేయన్‌కు ఆమె కాంగ్రెస్ పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తికేయన్ మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి మీద, కాంగ్రెస్ పార్టీ పై నమ్మకం తో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలంటే షర్మిల రెడ్డి మాత్రమే సరైన నాయకురాలు అని అయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజలపక్షాన నిలుస్తుందని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరానని కార్తికేయన్ పేర్కొన్నారు. తాను నగరి నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ ప్రజాసేవ చేస్తానని తెలిపారు. తాను 2005 లో పుత్తూరు మునిసిపల్ కాన్సిలర్ గా సేవలందించానని, ప్రస్తుతం తన సతీమణి వనిత కార్తికేయన్ కూడా పుత్తూరు మునిసిపల్ 16వ వార్డు కౌన్సిలర్ గా సేవలందిస్తున్నారని తెలిపారు.ఏపీసీసీ అధ్యక్షురాలు వై ఎస్. షర్మిల రెడ్డి.

## యోగ మన ప్రాచీన శాస్త్రం

విశాలాంధ్ర - పుత్తూరు : యోగ శాస్త్రం అనేది భారతదేశంలో వేయి సంవత్సరాల ముందే పుట్టిందని, యోగా వల్ల శారీరక మానసిక రుగ్మతలు తొలగుతాయని డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. యోగాంధ్ర 20 25వ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో యోగాభ్యాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ యోగా వల్ల అనేక లాభాలు ఉన్నాయని, కులమతాలకు అతీతంగా అందరూ యోగ అభ్యాసం చేయవచ్చని అన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు కూడా అలవాడతాయని ప్రిన్సిపాల్ అన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు యోగాసనాలను అభ్యాసం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య, వి. వీరయ్య, ఏ. నాగేశ్వరరావు, డాక్టర్ ఏ. దేవకి, సాంసన్ రాజు, టీ.నరసింహులు, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ పి. వెంకటేశన్ తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యాసంస్థల యాజమానులు ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులే?

## ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుల పైన దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

### - రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టాలి

**విశాలాంధ్ర - తిరుపతి :** రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడి అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో శ్రీ చైతన్య కళాశాల వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు పైన దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని ఈరోజు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో గాంధీ రోడ్డు వద్ద ఉన్నటువంటి చైతన్య కాలేజ్ ముందు ధర్నా నిర్వహించడం చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. ఉదయ్ కుమార్, సి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్య మాఫియా ఫీజుల దోపిడీ పుస్తకాల వ్యాపారం అరికట్టాలని విజయవాడ పట్టణంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుల పైన దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.. ఫీజుల దోపిడీ అరికట్టమని అడిగితే విద్యార్థి నాయకుల పైన దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు దాదాపు 90% పైగా ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులవే ఉన్నాయన్నారు. ఇంకా ప్రభుత్వ విద్యాసంస్థలు ఎక్కడ అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో ఎంత ఫీజు ఉండాలా దాని ప్రకారమే వసూలు చేసే విధంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైతన్య విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే నారాయణ విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే ఎస్సార్ విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే భాష్యం విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే రాష్ట్రంలో ఏ విద్యాసంస్థలు తీసుకున్న కూడా ఎన్డీఏ ప్రభుత్వం లో ఉన్న ప్రజా ప్రతినిధులవే అన్నారు.. ప్రభుత్వ నిబంధనలకు విధంగా పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు వేల రూపాయలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. విద్య మాఫియా అరికట్టాలని విద్యాదోపిడి ఆపాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుల పైన దాడి చేసి అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు దాడి చేసిన ఎస్ఐ శంకర్ కానిస్టేబుల్ వీరులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ హరికృష్ణ, ఓం రాజు, మోహన్ తిరుపతి నగర్ నాయకులు వినయ్, సుబ్బు, లోకేష్, జయ, పవన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ మార్నింగ్ కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారం

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

**విశాలాంధ్ర-నాయుడుపేట:** సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎప్పటి అప్పుడు ప్రజల మధ్య ఉండే గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమం ను చేపట్టినట్లు ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారం చేస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ తెలిపారు. గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమం లో భాగంగా నాయుడుపేట మునిరత్నం నగర్ లో ముందుగా అధికారులు, మహిళలతో యోగేంద్ర కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం ఆమె కాలనివాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను ఆమె దృష్టి కి తీసుకొని వచ్చేరు. ఎన్నికల సమయంలో మాత్రం పార్టీ నేతలు తమ సమస్యలను వెంటనే పరిష్కాతీస్తాం అని హామీలు ఇచ్చారని కానీ తర్వాత తాము ఎంత మంది అధికారులు చుట్టు తిరిగిన పట్టించుకోవడం లేదు అని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే విజయ శ్రీ సానుకూలంగా స్పందించి అక్కడే ఉన్న అధికారులను వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లలా, ముత్యాలయ్య, లాయర్ గంగా ప్రసాద్, నానబాల సుబ్బారావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు.

# సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా వచ్చే రక్త రుగ్మత

### - దాసుకుప్పం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్

**విశాలాంధ్ర-సత్యవేడు:** సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా వచ్చే రక్త రుగ్మత అని సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ వ్యాధిలో ఎర్ర రక్త కణాలు కొడవలి,చంద్రవంక ఆకారంలో ఉంటాయ న్నారు. కొడవలి ఆకారపు కణాలు రక్త నాళాల ద్వారా సులభంగా ప్రవహించలేవు అన్నారు. సికిల్ సెల్ వ్యాధిలో ఎర్ర రక్త కణాలు అసాధా రణమైన హిమోగ్లోబిన్ను ఉత్పత్తి చేస్తాయన్నారు. కొడవలి కణాలు రక్తనాళాలను అడ్డుకున్నప్పుడు నొప్పి వస్తుందని ఆయన గుర్తు చేశారు. దీంతోపాటు కొడవలి కణాలు త్వరగా చనిపోవడం వల్ల రక్తహీనతకు దారి తీస్తుంది అన్నారు. పైగా కొడవలి కణాలు మెదడుకు రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటే స్ట్రోక్ వచ్చే ప్రమాదం కూడా ఉంద న్నారు. ఈ వ్యాధిని నయం చేయడా నికి చికిత్సలు ఉన్నప్పటికీ, కొడవలి కణాలను పూర్తిగా తొలగించడం అసాధ్యమ న్నారు. అయితే ఆరోగ్యకర మైన జీవనశైలి, వైద్య సంరక్షణ ద్వారా వ్యాధి లక్షణాలు నయం చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మురళి, స్టాఫ్ నర్స్ వనజాక్షి, ఎఫ్ఎన్ఓ గాయత్రి,కవిత పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులకు దరఖాస్తు చేసుకోండి

**విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆద్వర్యంలో నిర్వహించబడుతున్న తిరుపతి జిల్లా లోని డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విధ్యాలయాలలో 2025 -26 విద్యాసంవత్సరానికి గాను 6,7,8,9 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తుల ఆహ్వానించుచున్నట్లు ఆ విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ టి. పద్మజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన సీట్ల సంబంధిత పాఠశాల వివరాలను కూడా తెలియజేశారు. తిరుపతి జిల్లాలోని బాలుర పాఠశాలలో నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడు, బాలికల పాఠశాలలు పుదూరు, సూళ్లూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరు పాఠశాలలుగా పేర్కొనడం జరిగినది. పైన తెలిపిన గురుకులాల్లో 6,7,8,9 తరగతులలో మిగిలిన సీట్లకు విద్యార్థులు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోగలరు అని తెలియజేశారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 25న ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడును అని తెలియజేశారు. కావున అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా ఆ ప్రకటనలో తెలియజేశారు.

# డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద డొక్కాసీతమ్మ స్ఫూర్తితో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయంతో జనసేన నాయకులు గురువారం పేదలకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారనానరు. ఆయన ఆశయాల్లో భాగంగానే పేదలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి లక్ష్మణ్, మహేష్, ప్రదీప్‌కుమార్, మణి, గరికపాటి చంద్ర, కాపునాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జసేన నాయకులు పగడాల ప్రతాప్, అరిగల వేణుగోపాల్, నాగవరం మాధవ, మురళి జొన్నలగడ్డ, బీజేపీ నాయకులు రమణారెడ్డి, రాజా, నవీన్, మునిచంద్ర, వీర మహిళలు, కవిత, బత్తెమ్మ, శారద, గాయత్రి పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**విశాలాంధ్ర - గూడూరు :** గూడూరు పట్టణంలో ని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర లో భాగంగా నెల్లూరు ప్రముఖ యోగా మాస్టార్ వెంకురెడ్డి ఆధ్వర్యములో యోగా సాధన కార్యక్రమము నిర్వహించారు. ఈ సంధర్భంగా యోగా మాస్టర్ వెంకురెడ్డి మాట్లాడుతూ యోగ విద్యార్థి దశ నుండే నేర్చుకోవటం అనివార్యం మరియు ఆవశ్యకం అని కొనియాడారు. అద్భుతంగా, ఆరోగ్యంగా, ఆనందముగా జీవించ దానికి యోగభ్యాసం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమములో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్బీ,శైలజ,రజని,సుప్రజ, సాయి శ్రీనివాస్, హరిత,యామిని , విద్యార్థులు పాల్గొన్నారు.

# యోగాతో శరీరక, మానసిక ఉల్లాసం

**విశాలాంధ్ర - గూడూరు :** గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నేస్ ధ్యాన కేంద్రం సాకారంతో విద్యార్థినిలకు యోగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు చేశారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒత్తిడి కి లోనవుతున్నారని చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు .యోగా ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేయాలని దీంతో మానసిక శారీరక ఉల్లాసం పెరుగుతుందని సూచించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యోగాకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని మనమందరము సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు .

# కొల్లడం,చిన్నఈటిపాకంలో భూసేకరణపై తుది విచారణ

**విశాలాంధ్ర-సత్యవేడు:** సత్యవేడు మండలం కొల్లడం, చిన్న ఈటిపాకంగ్రామాల్లో రెవెన్యూ అధికారుల బృందం భూసేకరణకు సంబంధించి తుది అవార్డు విచారణ నిర్వహించారు. గురువారం సులూరుపేట ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన తహసిల్దార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఓజిలి తహసిల్దారు పద్మావతి,బుచ్చినాయుడు కండ్రిగ రెవెన్యూ డిటి చంద్రబాబు తదితరులు రెవెన్యూ బృందం అవార్డు విచారణ చేశారు. ఈ నేపథ్యంలో చిన్నఈటిపాకం గ్రామంలో 7-88 సెంట్లు భూములకు సంబంధించి 28 మంది రైతులు వారి హక్కు పత్రాలను,పట్టాదారు పాస్ పుస్తకం,ఇతర డాక్యుమెంట్లు రెవెన్యూ బృందానికి సమర్పించి టైటిల్ డీడ్ ధ్రువీకరించుకోవడం జరిగింది. అలాగే కొల్లడం గ్రామంలో మూడు ఎకరాల 80 సెంట్లు సంబంధించి ముగ్గురు రైతుల వద్ద నుంచి హక్కు పత్రాలను సమర్పించి భూహక్కును నిర్ధారించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఏవో రవికుమార్,స్థానిక రెవెన్యూ డిటి త్యాగరాజు,ఆర్ఐ సురేష్,వీఆర్వో వినోద్ కుమార్,రైతులు పలువురు పాల్గొన్నారు

# పీలేరు టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా దశరదాచారి

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి:** టీడీపీ పీలేరు సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా శ్రీకాళ హస్తికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరదాచారి నియమితుల య్యారు. గురువారం ఆయన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగల ఎన్నికల గురించి చర్చించారు. ఈ సందర్భంగా దశరదాచారి మాట్లాడుతూ తనను పీలేరు టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా నియమించడం సంతోషకరవకున్నారు. అందరి సహకారంతో సంస్థాగత ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, అమీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే విజయ శ్రీ కృషి

- టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి

విశాలాంధ్ర-నాయుడుపేట: తన తండ్రి మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సారథ్యంలో ఆయన అందిస్తున్న సూచనలు,సలహాల తోపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ ల సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇప్పటికే 251 కోట్ల రూపా యలతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారని తెలియజేశారు. నియోజకవర్గ తొలి మహిళ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి రికార్డు సృష్టించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తన తండ్రి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అడుగుజాడల్లో నడుస్తూ సూళ్లూరు పేట నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమా నికి బాటలు వేస్తున్నారని కొనియాడారు.ఏడాది పాలనలో నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి పనిలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజయం సాధించారని తెలిపారు. సూళ్లూరుపేట పట్టణ ంలో జరిగిన పక్షుల పండుగ తోపాటు నాయుడుపేట స్వర్ణముఖి నది ఏటి పండుగలను విజయవంతంగా నిర్వహించారు అని తెలిపారు. అలాగే 8 ఏళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన శ్రీ హజరత్ అమీర్ షావలి గందోత్సవాన్ని ఇరు వర్గాలతో చర్చించి తన తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉరుసు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, పట్టణ ప్రజలను అబ్బుర పరిచారని అన్నారు.అలాగే ఈనెల 21వ తేదీ జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయడం కోసం అధికారులను సమయత్తం చేస్తూ నియోజకవర్గంలోని పలుచోట్ల యోగా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను ప్రోత్సహిస్తున్నారని తెలియజేశారు. నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడం కోసం ప్రతి శుక్రవారం సూళ్లూరుపేట పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా వేదిక కార్యక్ర మాలు నిర్వహించి, తనకు అందిన సమస్యల అర్జీలను అధికారుల దృష్టికి తీసుకుపోయి వెంటనే పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోవడం కోసం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ గుడ్ మార్నింగ్ సూళ్లూరు పేట,గుడ్ మార్నింగ్ నాయుడుపేట కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి గడపకు వెళ్లి సమస్య లను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్నారని,మహిళా ఎమ్మెల్యేగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తండ్రి బాటలో నడుస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కూటమి నాయకులందరినీ కలుపుకొని పోతూ... వారందరి సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తెలిసిందేందుకు తన వంతు కృషి చేస్తున్నారని టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి తెలియజేశారు.

## సికిల్ సెల్ అనీమియా అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ : ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి స్విమ్స్ సర్కిల్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనేది ఆంధ్ర ప్రదేశ్ లో ముఖ్యంగా గిరిజన జనాభాలో గణనీయమైన ప్రాబల్యం కలిగిన జన్యురుగ్మత అని దగ్గరి బంధువుల మధ్య వివాహాలు, పోషకాహార లోపం వంటి కారణాల వలన సికిల్ సెల్ అనీమియా గిరిజన జనాభాను అసమానంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. ప్రజలలో సికిల్ సెల్ రక్తహీనత పట్ల అవగాహన లేక పోవడం, గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు సరిపోక పోవడం, రోగ నిర్ధారణ, చికిత్స ఆలస్యం కావడం వంటి కారణాల వలన ఈ సికిల్ సెల్ అనీమియా ప్రమాదకరంగా మారుతుందని అన్నారు. ఈ జిల్లా లో 1,24,000 మంది జనాభా కు స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా 90,000 మంది రిజిస్టర్ అయి ఉన్నారని 84,000 మందికి సికిల్ సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించగా అందరికి నెగటివ్ వచ్చాయని తెలిపారు. 2047 సంవత్సరానికి సికిల్ సెల్ అనీమియా ను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది అని తెలిపారు. జూన్19 నుండి జూలై 3 వరకు ప్రజలలో మాస్ స్క్రీనింగ్ అలాగే సికిల్ సెల్ అనీమియా పైన విస్తృతమైన అవగాహనా ప్రచారాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ రాజేష్ కుమార్ సికిల్ సెల్ అనీమియా ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ రూప్ కుమార్ డిఎంఓ, డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి డిఐఓ, డాక్టర్ రెడ్డి ప్రసాద్, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కిరణ్ కుమార్, ఖాజ వలి డిప్యూటి డెమోలు, ఎఎన్ఎమ్ లు, ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగదినోత్సవ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలకేంద్రం చిల్లకూరు లో గురువారం, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు మండలవిద్యాశాఖాధికారి-2, మహమ్మద్ రఫూఫ్ ఆధ్వర్యంలో, జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగ దినోత్సవం గురించి అవగాహన కల్పించే ర్యాలీ చిల్లకూరు లో నిర్వహించారు. నిత్య మరియు దైనందిన జీవితంలో యోగ ఉపయో గాలు , ఆవశ్యకతను వివరించారు. ప్రధానంగా విద్యార్థులకు యోగ చేయటంవలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. శారీరిక మరియు మానసికంగా విద్యార్థులు ధృడంగా , బలంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే శక్తిని పొందవచ్చు అని పొందగలరు అని రఫూఫ్ తెలిపారు. పిడి శ్రీనివాసులు, అప్పలచినయుడు, దుర్గా శారద , మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొని విజయవంతం చేసారు.

## సుపరిపాలన పేదల సంక్షేమమే బిజెపి ప్రభుత్వం లక్ష్యం

-రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు

విశాలాంధ్ర- గూడూరు : భారతదేశంలో సుపరిపాలన పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని నరసింగరావుపేట లో ఉన్న బిజెపి కార్యాలయంలో గూడూరు అర్బన్ మండల పార్టీ బిజెపి అధ్యక్షులు కే దయాకర్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ ప్రధానిగా 11 సంవత్సరాల పరిపాలనా కాలంలో వికసిత భారతదేశపు అమృతకాలం సేవ, సుపరిపాలన పేదల సంక్షేమానికి అందించిన సేవా కార్యక్రమాల భారతీయ జనతా పార్టీ వికసిత భారత్ సంకల్ప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకు సేవ అణగారిన వర్గాలకు గౌరవం పేరుతో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ అన్న యోజన, పీఎం సురక్ష బీమా యోజన పి.ఎం.స్వానిధి యోజన, రైతుల సంక్షేమానికి భరోసా పథకం ద్వారా పీఎం కిసాన్ సామాన్ నిధి పీఎం పసల్ బీమా యోజన మారే శక్తికి ప్రోత్సహించేందుకు పార్లమెంటు అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేలా మారి శక్తివంతం అధినియం, అందరికీ అందుబాటు లో ఆరోగ్య సంరక్షణ ద్వారా ఆయుష్మాన్ భారత్, దేశమే ప్రథమం జాతీయ భద్రతే ముఖ్యం ద్వారా ఆపరేషన్ సింధూ జమ్మూ కాశ్మీర్ ను రాజ్యాంగపరంగా జాతీయపరంగా జాతీయపరంగా భారత్తో కలిపేందుకు ఆర్టికల్ 370 35ఏ ను ప్రతి చేయడం లాంటి చట్టాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలుగా భవిష్యత్తులో ప్రపంచంలోనే భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంకల్ప సభలో నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రూపొందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ప్రమాణం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణం నాయుడు , బిందు రెడ్డి జి శ్రీనివాసులు, గుమ్మడి శ్రీనివాసులు, జీవీ నాయుడు, మధిర సునీల్ కుమార్, బల్లి ప్రభాకర్ రావు, నాగం హరికృష్ణ, రవీంద్ర, శివ, నాగమణి, వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతుల కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనబడలేదా

- గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపైనే అగచాట్లు పడుతుంటే ప్రభుత్వ చర్యలు ఎక్కడ
- వ్యవసాయ మంత్రి జిల్లా పర్యటనకు వచ్చి ఎనిమిది రూపాయలు కొనుగోలు చేయాలన్న ఎక్కడ అమలు కానీ వైనం

విశాలాంధ్ర- పుత్తూరు : రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మేలు చేయకపోతే ఉద్యమాలు చేపడతాం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి టి.రాకేష్ కిరణ్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో:మామిడి రైతుల ఆవేదన, బాధలు రోజురోజుకు తీవ్రతరమైపోతు న్నాయి, మామిడి రైతుల కన్నీళ్లు కూటమి ప్రభుత్వం అసలు పట్టించు కోలేదని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ క్రియాశీలకకార్యదర్శి రాకేష్ కిరణ్ ఆవేదన. ఉమ్మడి చిత్తూరు తిరుపతి జిల్లాలోరైతులు కష్టాలు పడుతున్నారని, సంవత్సరం కాలం పాటు కష్టం శ్రమించి అప్పుచేసి పెట్టుబడి పెట్టి మామిడి పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక కొనుగోలు చేసేవారు లేక అన్నదాత కన్నీరు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 8౦4 పేరుకే చెప్పిన ఎక్కడ అమలు కాలేదని మండిపడ్డారు. పరిశ్రమ వద్ద దాదాపు మూడు కిలోమీటర్ల మేర రైతులు మామిడికాయలతో ట్రాక్టర్లలో నాలుగు రోజులుగా వేచి చూస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు బడా బాబులకి ఫోన్ ద్వారా టోకెన్ సిస్టంతో పర్మినెంట్ అందిస్తున్నారు సామాన్య రైతులు కౌవులు రైతులు వారు పండించే మామిడి కాయలు గిట్టుబాటు ధర లేక ఒకే ఎత్తయితే మరోపక్క రైతులు మామిడి ఫ్యాక్టరీలు వద్ద ఆగసాట్లు పడుతున్నారు ఇకనైనా రైతులకి న్యాయం జరగకపోతే ఫ్యాక్టరీల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## కొత్త యూనిఫాం ధరించిన విద్యార్థులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అందించిన కొత్త యూనిఫామ్ తో కల్లివెట్టు పాఠశాల విద్యార్థులు ధరించి గురువారం పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం విద్యార్థులను అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు అందించే పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంపై ఎటువంటి రాజకీయ రంగులు, నాయకుల ఫొటోలు ముద్రించ కుండ కూటమి ప్రభుత్వం సరికొత్త రంగుల్లో, నాణ్యతతో ఉన్న వస్తువులు అందించారు. పాఠశాలలు తెరిచి వారం రోజులు గడిచాయి. విద్యార్థులకు కొత్త యూనిఫాం మార్చడంతో పాఠశాలకు కొత్తదనం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి యోగా ప్రతి ఒక్కరికి అవసరం

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

విశాలాంధ్ర - తడ : యోగా సాధన మానసిక ఆరోగ్యాన్ని ఒత్తిడిని మరియు ఏకాగ్రతను పెంచుతు ంది అని సూళ్లూరుపేట శాసనస భ్యులు నెలవెల విజ యశ్రీ పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా తడమండల పరిధిలోని భీమిని వారి పాలెం లోని లేక్ వ్యూ రిసార్ట్స్ నందు సుమారు 500 మందితో యోగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్మయి, ఫారెస్ట్ అధికారిని హరిత మరియు జిల్లా మండల స్థాయి అధికారులు సమక్షంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నెలవల విజయశ్రీ మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన కార్యక్రమాల్లో ఒకటిగా నిలవాలని ,ఇది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడానికి సహాయపడుతుంది ఆమె తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరు రోజువారి కార్యక్రమాల్లో భాగంగా అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో మన దేశ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వ ర్యంలో సుమారు ఐదు లక్షల మందితో యోగా ంధ్ర కార్యక్రమం జరుగను న్నదని ఆమె తెలిపారు. ఆర్డీవో కిరణ్మయి మాట్లాడుతూ యోగా సాధన ఒత్తిడి, ఆందోళన మరియు డిప్రెషన్ వంటి మానసిక సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఏకాగ్రతను మెరుగుపరచడం ద్వారా జ్ఞాపకశక్తిని పెంచుతుంది మరియు మానసిక స్పష్టతను ఇస్తుంది అని అన్నారు.ఈ కార్యక్ర మం లో తాసిల్దార్ శరత్ బాబు, ఎంపి డీవో శేఖర్ నాయక్, ఏం ఈ ఓ పూర్ణ చంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు,స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు సెల్వం, మురళీరెడ్డి, టీ కే శ్రీనివాసన్, సుధ,రవి, భాస్కర్,దేశప్పన్,రత్నం, బీజేపీ పార్టీ నాయకులు చిల్లకూరు తేజారెడ్డి,కృష్ణమూర్తి,ధనుంజయ తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు,ఆశావర్కర్లు, ఏ ఎన్ ఏం లు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం: ఏఐవైఎఫ్

– సూళ్లూరుపేట వై జంక్షన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సంతకాల సేకరణ

**విశాలాంధ్ర – సూళ్లూరుపేట :** ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి జిల్లా కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతు మన రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నెలకి రూ. 3 వేలు చొప్పన నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు నిరుద్యోగ యువతకి ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారం చేజిక్కించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తని పరిస్థితి వుంది. నిరుద్యోగ ఎ భృతి వస్తే పోటీ పరీక్షలకు శిక్షణ పొందుదామని నిరుద్యోగ భృతి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న నిరుద్యోగులను నట్టేటముంచారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 2025 ఫిబ్రవరి నెలలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ద్వారా నిర్వహించిన 'స్కిల్ సెన్సెక్స్ సర్వే' ప్రకారం 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది దగ్గర వివరాలను సేకరించగా ఉపాధి లేని వారి సంఖ్య కోటిన్నర పైనే ఉందని, రాష్ట్రంలో 18 నుండి 50సంఎల మధ్య వయస్సు వారిలో ఏ ఉపాధి ఎ లేనివారు ఒక కోటి 56 లక్షల మందిఉన్నారని ప్రభుత్వగణాంకాలు తెలియజేస్తున్నాయి.వీరిలో 52.69 లక్షల మంది ఏదో ఒక పని చేస్తున్నట్లు తెలపగా 52.74 లక్షల మంది ఏ పనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలపడం గమనార్హం.నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో నైపుణ్యం కలిగించేలా శిక్షణ ఇచ్చి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రకటనలే తప్ప సంవత్సర కాలంలో నిరుద్యోగ యువతకు ఒరిగిందేమి లేదు ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో సుమారు 3.20 లక్షల ఖాళీలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్న ఖాళీ పోస్టులపై ఎ శ్వేతపత్రం విడుదలచేసే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియక కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఎ పోరాడితేనే భవిత అని రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి ఏఐవైఎఫ్ పిలుపునిస్తున్నది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లో యువతకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. నిరుద్యోగ భృతి నెలకు 3000 ఇవ్వాలి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేసి అమరావతిని ఫ్రిజోన్‌గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కోసం. నిరుద్యోగ అర్జీ స్వీకరణ కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా సహాయలు కార్యదర్శి తొండు మల్లికార్జున్ నాగార్జున సాయి రమణయ్య చెంచమ్మ బాలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సేవ కేంద్రానికి ఉద్యోగస్తుల డుమ్మా

**విశాలాంధ్ర – బైరెడ్డిపల్లి :** బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రానికి గత వారం నుండి ఉద్యోగస్తులు రావడం లేదని రైతులు తెలియజేస్తున్నారు. అనేక సమస్యలతో మండల రైతులు మండల కేంద్రంలోని ఈ కార్యాలయానికి వస్తుంటారు ప్రతి రోజు 100 మంది రైతుల వరకు ఈ కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్ళిపోతున్నారు. సమాధానం చెప్పడానికి ఒకరు కూడా ఉండకపోవడంతో విస్మయాన్ని వ్యక్తపరుస్తున్నారు. సంబంధిత మండల అధికారులకు విషయాన్ని వివరించగా, వారు సెలవుల్లో ఉన్నట్లు తెలియజేస్తున్నారు ఈ విషయం తెలియక రైతులు ప్రతిరోజు ఎక్కువ సంఖ్యలో ఈ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు సెలవుల్లో వెళ్లేటప్పుడు ఆ కార్యాలయానికి ఒక బోర్డు తగిలించినట్లయితే రైతులు ఈ కార్యాలయానికి రాకుండా ఉంటారు. ముందు జాగ్రత్త చర్యగా ఈ విధమైనచర్యలు తీసుకోవాలని మండల రైతులు తెలియజేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో చిత్తూరుకు రెండు బహుమతులు

**విశాలాంధ్ర – చిత్తూరు:** రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో చిత్తూరు జిల్లాకు రెండు బహుమతులు వచ్చినట్లు డిఆర్ఓ మోహన్ కుమార్ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర పోటీలకు పంపడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో చిత్తూరు కు చెందిన కిరణ్ అని అమ్మాయి ప్రథమ స్థానంలో నిలిచిందని, అలాగే యోగా గ్రూప్ విభాగంలో చిత్తూరు జిల్లాకు చెందిన కుశల్ కుమార్, నికిత, భార్గవ్ రెడ్డి, హర్ష ప్రీతం ల బృందం రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరందరూ ఈనెల 21 తేదీన విశాఖపట్నం లో జరగనున్న యోగ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా స్థాయిలో ఈనెల 21వ తేదీన చిత్తూర్ మెకానికల్ మైదానంలో 6000 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు డిఆర్ఓ తెలిపారు.

## సికిల్ సెల్ అనీమియా నిర్మూలన అవగాహన

**విశాలాంధ్ర– గంగవరం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ అనీమియా నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికిల్ సెల్ అనీమియా అంటే ఏమిటి వ్యాధి లక్షణాలు నిర్ధారణ పరీక్షలు మరియు ఎవరు పరీక్షించుకోవాలి అనే అంశం పై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాధి రక్త కణాలకు సంబంధించిన వ్యాధి మరియు తల్లిదండ్రుల నుంచి సంక్రమించే వ్యాధి, వ్యాధి వల్ల రక్త కణాలు కొడవలి ఆకారంలో మార్పు చెందుతాయని మరియు వ్యాధి లక్షణాలు రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది కళ్ళు పసుపు రంగులోకి మారుతుంది మరియు తీవ్రమైన కీళ్ల నొప్పులు ఒళ్ళు నొప్పులు మరియు శ్వాస పెంచుకోవడంలో ఇబ్బంది అలసట తరచుగా అంటూ వ్యాధులు వస్తాయని గర్భనిర్ధారణ సమయంలో సమస్యలు తలెత్తుతాయని తెలిపారు మరియు పై తెలిపిన వ్యాధి లక్షణాలు ఉన్నవారు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేస్తారని తెలియజేశారు.కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు డాక్టర్ లహరి సి హెచ్ ఓ మనోరమాదేవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడి రైతులకు అవగాహన కల్పించిన ఎంపీడీవో చంద్రమౌళి

**విశాలాంధ్ర – కార్వేటినగరం:** మండల పరిధిలోని కత్తిరిపల్లి అన్నూరు అమ్మపల్లి సచివాలయాలలో గురువారం ఎంపీడీవో టి చంద్రమౌళి ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మామిడి రైతులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలు నిర్వహించి మామిడి రైతులకు మామిడికాయలు, కోతలు ఫ్యాక్టరీ లతో సమన్వయం మొదలగు విషయాలను వివరించారు. అలాగే అల్లూరు వద్ద ఏబిసి మామిడి జ్యూస్ ఫ్యాక్టరీ నీ సందర్శించి రైతుల వివరాల్ని పరిశీలించారు. హౌస్ సూపరింటెండెంట్ ఏవో హేమ లత, పంచాయతీ కార్యదర్శి బి జయప్రకాష్ మామిడి రైతులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**విశాలాంధ్ర–కోట:** ఈనెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసిల్దార్ జయజయ రావు, ఎంపీడీవో దిలీప్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 140 ప్రదేశాల్లో ఒక ప్రదేశానికి ఒక్కు సచివాలయ సిబ్బంది ఇన్ ఛార్జిగా ప్రజలు,ఉపాధి కూలీలు,పొదుపు మహిళలు, గ్రామ పెద్దలు,ప్రజాప్రతి నిధులుతో కలిసి వారి వారి సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఉదయం 7 గంటల నుండి 8 గంటలలోపు యోగా కార్యక్రమం నిర్వహించాలని ఈ కార్యక్రమాన్ని మండల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు.అలాగే అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు, హాస్టల్లు,గురుకులాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య,పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యూస్ ఫ్యాక్టరీని తనిఖీ చేసిన తాసిల్దార్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వర రాజు

**విశాలాంధ్ర – కార్వేటినగరం :** చిత్తూరు జిల్లా కార్వేటి నగరం మండలం ఏబీసీ ఫ్రూట్స్ అన్నూరు యూనిట్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జ్యూస్ ఫ్యాక్టరీని కార్వేటి నగర్ మండల తహసిల్దార్ నాగరాజు, జిల్లా పార్లమెంటు రైతు అధ్యక్షులు నగలపాటి నాగేశ్వర రాజు, గురువారం తనిఖీ నిర్వహించారు . అనంతరం జ్యూస్ ఫ్యాక్టరీ మేనేజర్ వెంకటేష్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వరుస క్రమంలో టోకెన్ తీసుకోవాలని కోరారు. రైతులు క్యూ పద్ధతిలో తీసుకొని వెళ్లాలని రైతులను కోరారు. పక్వానికి వచ్చిన కాయలు మాత్రం కోసి తీసుకుని రావాలని రైతులకు తెలియజేశారు. అందరూ రైతులకు న్యాయం జరుగుతుంది అని తెలియజేశారు. ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ పూర్తి సామర్థ్యంతో క్రషింగ్ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ట న్నుకుకు ప్రభుత్వము 4000 రూపాయలు రాయితీ ప్రకటించింది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఒక ట్రాక్టర్లో 5 టన్నులు తీసుకువచ్చిన రైతుకు ప్రభుత్వం తరపున 20000 రూపాయలు వస్తుందన్నారు. కావున రైతులు సమయపాలన పాటించి సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై పోలీసులు దాడి

**విశాలాంధ్ర– చిత్తూరు:** జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలోని రాంనగర్ కాలనీ బి క్రాస్ లో సుమతి అనే మహిళ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు డిఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో చిత్తూరు రెండవ పట్టణ సీఐ ఇన్చార్జ్ మహేశ్వర తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న సుమతి అనే మహిళతో పాటు విటులను అరెస్టు చేశారు.అలాగే సంతపేట నందు పేకాట స్థావరం పై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 40 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మహేశ్వర తెలిపారు. ఈ దాడుల్లో మహిళా ఎస్ఐ సుగుణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటిఐలో రెండవ దశ ప్రవేశమునకు దరఖాస్తులు ఆహ్వానం

**విశాలాంధ్ర – కార్వేటినగరం :** కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నందు వివిధ ట్రేడ్లలో రెండవ దశ ప్రవేశమునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటిఐ ప్రిన్సిపాల్ కె ఆనంద్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 15, 7,25.లోపు ప్రభుత్వ ఐటిఐ కార్వేటినగరం కార్యాల యము నందు తమ పదవ తరగతి మార్క్ లిస్ట్, బదిలీ సర్టిఫికేట్, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలకు కంప్యూటర్, టైలరింగ్ ట్రేడ్ నందు శిక్షణ ఇవ్వబడును. కావున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో తమ మార్క్స్ లిస్ట్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో 21 జూలై 20 25 తేదీన కార్వేటి నగరం ప్రభుత్వ ఆర్ఎస్ ప్రామిక శిక్షణ సంస్థ నందు ఇంటర్వ్యూకు హాజరు కావలెను అన్నారు. ఇతర వివరాలకు 91 600 12 9 9 9, 91 60960999 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఆనంద్ కోరారు.

## మూలకోనలో తిరుమలవాసి అనుమానాస్పద మృతి

**విశాలాంధ్ర – పుత్తూరు :** తిరుపతికి చెందిన ఆరుగురు బుధవారం ద్విచక్ర వాహనాల్లో పుత్తూరు మండలంలోని మూలకోనలో సరదాగా గడిపేందుకు వచ్చారు. అతిగా మద్యం సేవించడంతో వారిలో తిరుమల బాలాజీ నగర్ కు చెందిన ధర్మ(38) బుధవారం సాయంత్రం మరణించాడు. సహచరుల ఫిర్యాదుతో పుత్తూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప స్థానిక ప్రభుత్వాసుప త్రికి తరలించి, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## 28 నుంచి పురోహిత ధర్మ ప్రచారసభలు

### చిత్తూరు బ్రాహ్మణ సంఘం పిలుపు

విశాలాంధ్ర-చిత్తూరు: శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో తిరుపతిలో అర్చక, పురోహిత సంక్షేమ, అవగాహన ధర్మ ప్రచారసభలను నిర్వహిస్తున్నట్లు చిత్తూరు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం చిత్తూర్ ప్రెస్ క్లబ్ లో చిత్తూరు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పొణ్యం శ్రీనివాసశర్మ, సతీష్ కృష్ణమూర్తి, రామభద్ర తదితరులు మాట్లాడారు. ఈనెల 28, 29 వ తేదీల్లో రెండు రోజుల పాటు తిరుపతి వినాయకనగర్ కంచి మఠం సమీపంలోని టీటీడీ ఫంక్షన్ హాలులో రాయలసీమ స్థాయి పురోహిత సంక్షేమ, అవగాహన ధర్మ ప్రచారసభ లు నిర్వహించడం జరుగుతుందని. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు విజయేంద్రసరస్వతి స్వామితో పాటు, శ్రీశ్రీశ్రీ సత్యచంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామి హాజరవుతారని వెల్లడించారు. ఈ క్రమంలో భాగంగా పలు అంశాలపై వక్తలు అవగాహన కల్పిస్తారని అలాగే అర్చక, పురోహితుల సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి భారీగా బ్రాహ్మణులు అర్చకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## సేవా కార్యక్రమాల నడుమ కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తొట్టంబేడు: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముందస్తు జన్మదిన వేడుకలు గురువారం సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా జరిగాయి. జూన్ 20న ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకున తొట్టంబేడు మండలం బసవయ్య పాళెంకు చెందిన చొక్కానిరామ్మూర్తి, బిందు రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం, పుస్తకాల పంపిణీలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయనను వారు ఘనంగా సత్కరించారు. ఇక శ్రీకాళహస్తి మండలం వెలంపాడులో అబ్బూరు పుల్లమనాయుడు ఆహ్వానం మేరకు పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, పుస్తకాలను అందజేశారు. ఏర్పేడులో మండలాధ్యక్షుడు నరేష్, కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమం, రేణిగుంట ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుత్తివారి పల్లె వద్ద బీజేపీ నాయకులు ఆయనకు క్రేన్ సాయంతో గజమాల వేసి ఘనంగా సత్కరించారు. అక్షయ్య క్షేత్రంలో రాజారాయల్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక శ్రీకాళహస్తి పట్టణంలో ముత్తరాసిపాళెంలో వీరాస్వామి ఆచారి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు గరికపాటి రమేష్‌బాబు, మిత్రబృందం ఆధ్వర్యంలో తుఫాన్‌సెంటర్‌లో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు బీడీ బాలాజీ, కొండేటి గోపాల్, ఎస్వీ రమణ, వేదాం కృష్ణయ్య, వెంకటేష్, రవి ఆచారి, కూనాటి నాగరాజు, ధర్మయ్యయాదవ్, రాఘవనాయుడు, రవిచంద్ర, వెంకటేశ్వర్లు, తిరుపాల్‌నాయుడు, రవి రాయల్, విజయ్, తులసీ, రామ్, వినోద్, సురేష్, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమానికి హాజరైన చల్లా బాబు

విశాలాంధ్ర-చౌడేపల్లి: తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు సీనియర్ నాయకుడు ఆవుల రామచంద్రయ్య సతీమణి మునిరత్నమ్మ దశదిన కార్యక్రమానికి పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డిలు హాజరయ్యారు దివంగత మునిరత్నమ్మ చిత్రపటానికి పూలమాలవేసి వారి ఇరువురు ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### అసాంఘిక చర్యలకు నిలయం

## కడప నత్తం పాత గ్రామ సచివాలయం

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం కడపనతం పంచాయితీ కేంద్రంలోని పాత సచివాలయ భవనం అసాంఘిక చర్యలకు నిలయంగా మారిందని ఆగ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ముచ్చటగా ఉన్న ఈ భవనాన్ని పరిపాలన కొత్త భవనాల లోకి మార్చిన తర్వాత ఈ భవనం యొక్క ఆలనా పాలన కరువైంది. ఈ భవనంలో సాయంత్రం దాటిన తర్వాత అల్లరి ముఖులు చేరి మద్యం సేవించడం చేస్తున్నారని చుట్టుపక్కల వాళ్ళు తెలియజేస్తున్నారు. గత ప్రభుత్వం భారీ ఎత్తున సచివాలయాలను నిర్మించడం జరిగినది. అవసరం ఉన్నా లేకున్నా సచివాలయాల నిర్మాణాలు మాత్రం భారీగా సాగాయి. అందులో సిబ్బంది ఉద్యోగాలు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పట్టించుకునే నాధుడు కూడా లేడు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి భవనాలను నిర్మించి నంతమాత్రం అభివృద్ధిని పెంచగలిగారా అనే విషయాన్ని ఒకసారి ఆలోచించాలని మండలంలోని అనేక ప్రాంతాలలో ప్రజలు వాపోతున్నారు. మండలంలోని అనేక ప్రదేశాలలో ఇటువంటి పాత సచివాలయ భవనాలను వేరే వాటికి వినియోగించుకున్నట్లయితే ప్రజాధనాన్ని ఎంతో కొంత న్యాయం చేసిన వారు అవుతారు. లేని పక్షంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి నిలవలుగా తయారవుతాయని తెలుస్తున్నది.

## మరింత సులువుగా వరసిద్ధి వినాయక స్వామిదర్శనం

విశాలాంధ్ర - పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం స్వయంభు శ్రీ వరసిద్ధ వినాయక స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తిరుపతి దేవదాయ శాఖ ఆర్ జె సి చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు .శ్రీ స్వామివారి దేవస్థానము నందు భక్తులకు మౌలిక సదుపాయాలపై పరిశీలించిన తిరుపతి దేవదాయ శాఖ ఆర్ జె సి చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానం ఈవో పెంచుల కిషోర్ తో కలిసి శ్రీ స్వామివారి దర్శనం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. స్టోర్, అన్నదానం, సీసీ కెమెరాల రూమ్, పరిశీలించారు. మీటింగ్ హాల్లో జిల్లాలోని వివిధ చిన్న దేవాలయాలు నుంచి విచ్చేసిన ఈవోలు అధికారులతో మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహించి ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యంపై వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏసీ చిట్టెమ్మ, ఎఈఓలు కృష్ణారెడ్డి రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ సూపరిన్టెంట్లు పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్‌కు 12 మంది ఎంపిక

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యం.యన్. కంటి ఆసుపత్రి, చెన్నై వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడమైనది. మొత్తం పరీక్షించిన కేసులు 35 కేసులకు గానుకంటి ఆపరేషన్‌కు 12 మంది ఎంపిక ఆపరేషన్, ఫాలో అప్ మరియు మందులు ఉచితం. కార్యక్రమంలో ఆప్తమాలమిక్ ఆఫీసర్ రహమతుల్లాఖాన్, పి.హెచ్.సి సిబ్బంది, యం.యన్. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-పాలసముద్రం: అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ అరుణ కుమారి అన్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఆమె గురువారం నాడు బాలకృష్ణాపురం రామకృష్ణాపురం రెవిన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించుకున్న గ్రావెల్ తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు వెంటనే ప్రభుత్వానికి సంబంధించిన భూముల్లో హెచ్చరిక బోర్డు అవసరమైతే ట్రెంచింగ్ కూడా కొట్టించాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు అదేవిధంగా ఎవరైనా ప్రభుత్వ భూముల్లో అక్రమాలకు పాల్పడుతుంటే రైతులు గ్రామస్తులు రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలన్నారు ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి రెవిన్యూ అధికారిపై ఉందని ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన అధికారుల పైన కూడా చర్యలు తప్పవు అని ఆమె హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల సర్వేర్ గణేష్ ఆర్ ఐ దేవి వీఆర్వోలు రమేష్ నాయుడు వెంకటాచలం రమణయ్య సర్వేర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ పార్టీ శ్రేణులు నిరసన

### నిరసనలో పాల్గొన్న చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు చంద్రగిరి టవర్ క్లాక్ కూడలిలో నల్ల జెండాలు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దు అంబేద్కర్ రాజ్యాంగమే ముద్దని నినాదాలు చేశారు. ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని చంద్రగిరిలో వైఎస్ఆర్‌సీపీ నేతలు కార్యకర్తలు రోడ్డెక్కారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టును వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చెవిరెడ్డిని వెంటనే విడుదల చేయాలి చెవిరెడ్డిపై కూటమి ప్రభుత్వం కుట్రలు సిగ్గు సిగ్గు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి జైజగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వం అప్రజాస్వామికంగా చెవిరెడ్డిని అరెస్టు చేయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. చెవిరెడ్డిని మానసికంగా దెబ్బతీయడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని, ఆయన ఈ కేసులకు భయపడే వ్యక్తి కాదన్న విషయం పోలీసులు, ప్రభుత్వ పెద్దలు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. జైలుకు వెళుతున్నామని తెలిసినా చెవిరెడ్డి సిట్ అధికారులపై మీడియా ముందు ఆరోపణలు చేయడంతో ఆయన కుమారునిపై కేసు పెట్టి నోరుమూయించే ప్రయత్నం చేశారన్నారు. అయినా సరే సిట్ అధికారులు చేసిన తప్పులను బయటపెట్టిన చెవిరెడ్డి చివర వరకు పోరాటం సాగించారన్నారు. చివరకు విమానాశ్రయంలో అరెస్టు చేసి విజయవాడకు తీసుకువెళ్లి జైలుకు తరలిస్తున్నా సరే చెవిరెడ్డి సిట్ అధికారుల అరాచకాలు, అక్రమాలను మీడియా ముందు పెట్టారన్నారు. చెవిరెడ్డిని ఎవ్వరు ఏమీ చేయలేరని, ఆయన జైలు నుంచి వచ్చేంత వరకు ఆ కుటుంబానికి తాము అండగా నిలబడతామన్నారు. చంద్రగిరిలో చెవిరెడ్డి కుటుంబం వుంటే పట్టు కోల్పోతామన్న భయంతోనే వారిని అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంకు వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లిఏం తప్పు చేశాం.. ప్రజలకు మంచి చేయడమా..? మేం ఏం తప్పు చేశాం ప్రజలకు మంచి చేయడమా ఎందుకు మమ్మల్ని టార్గెట్ చేశారు ఇంత అధర్మంగా పరిపాలన చేస్తారనుకోలేదు. ధర్మం తప్పి చంద్రబాబు పాలన చేస్తున్నారు. అధికారంలోకి రాగానే మమ్మల్ని టార్గెట్ చేశారు. ఒక ఆడబిడ్డ రోడ్డుపైకి వచ్చి మీడియా ముందు మాట్లాడుతోందంటే ఆ కుటుంబం ఎంతలా బాధింపబడిందో అర్థం చేసుకోవాలి. ప్రజలకు మంచి చేయడం తప్ప తప్పులు చేయడం మాకు తెలియదు. అయినా సరే అరెస్టు చేశారు. మేము అధికారంలో వున్నప్పుడు ఈ చంద్రగిరి నియోజకవర్గంలో ఒక్కరిని కూడా అరెస్టు చేసి జైలుకు పంపలేదు. అయినా సరే వేధిస్తున్నారు. భరిస్తాం ఎవ్వరు ఏం చేశారు అన్నది ప్రజలు గుర్తిస్తారు. అంటూ చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ వెల్లడించారు. చంద్రగిరి క్లాక్‌టవర్ వద్ద నిర్వహించిన నిరసనలో పాల్గొన్న ఆమె ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని కొంత సమయం మౌనం పాటించారు. అనంతరం నిరసనలో పాల్గొని మీడియాతో మాట్లాడుతూ పైవ్యాఖ్యలు చేశారు.

# ప్రభుత్వ ఆదేశాల మేర మద్దతు ధర అందిస్తాం

**మామిడి రైతులకు నష్టం వాటిల్లకుండా చివరి కేజీ వరకు కొనుగోలు : కలెక్టర్ సుమిత్ కుమార్**

**విశాలాంధ్ర - చిత్తూరు:** జిల్లాలో పండే మామిడికి చిట్టచివరి కాయ అమ్ముడుపోయే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వం అందించే 4 రూపాయలు మద్దతు ధర సబ్సిడీ రూపంలో రైతు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు జమ చేయడం జరుగుతుందనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ లో మామిడి మండి యాజమానులు, రైతులతో మామిడి మద్దతు ధర పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ తోతాపురి మామిడిని చివరి కేజీ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు ఆందోళన చెంది పక్వానికి రాక మునుపే మామిడి కాయలను గుజ్జు పరిశ్రమలకు తరలించవద్దని సూచించారు. మండలాల్లో గ్రామ సభల ద్వారా మామిడి అమ్మకం పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ట్రేడర్స్ పైన ఆధార పడవద్దు. చిన్న సన్నకారు రైతులు పక్వానికి వచ్చిన మామిడికాయలని కంపెనీలకు తరలించాలని రైతులకు పిలుపునిచ్చారు. క్రిష్ణగిరికి జిల్లా అధికారుల కమిటీతో ఒక బృందం పంపడం జరిగిందని అక్కడ కొనుగోలు ఎలా జరుగుతున్నాయి వాటిని ఎలా అమలు చేస్తున్నారు రైతులకు ఎలాంటి రుసుము అందజేస్తున్నారు తెలుసుకోవడానికి బృందం పంపడం జరిగిందని రెండు రోజుల్లో బృందం నివేదికలు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తోటాపురి రైతులు ఫ్యాక్టరీలకు అమ్మిన, వర్తకులకు మామిడికాయల అమ్మిన, భూమి పైన ఉన్న మామిడి పంటని వర్తకులు అమ్మిన వారికి ప్రభుత్వం తరపున కిలోకి నాలుగు రూపాయలు సబ్సిడీ అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు మామిడి రైతులకు సలహాలు, సూచనల కొరకు ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్ట్ ల వారీగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో మామిడి పండించే రైతులు ఎటువంటి ఇబ్బంది పడకూడదని, ముఖ్య మంత్రి నిర్ణయం మేరకు ప్రతి రైతుకు కేజీ కి రూ.4 చొప్పున వారికి మద్దతు ధర ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు జిల్లాకు చెందిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉద్యోగులను, తాహసిల్దార్లను పెట్టి ఎక్కడెక్కడ ఎంత మామిడి వస్తుంది, ఏ వ్యాపారి కొంటున్నారు, ఎటువైపు వెళ్తుంది, ఏ రైతు నుండి కొన్నారు తదితర వివరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులకు మనదగ్గర పండేటటువంటి మామిడి కాయలకు చిట్టచివరి దాకా జూన్ మొదటి వారం నుండి జూలై, ఆగస్టు నెల చివరి కాయ వరకు ఎంత పంట వస్తుందో దానంతటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వారు అందించే 4 రూపాయల మద్దతు ధర ఆగిపోతుందనే అపోహ వలన ఎక్కువ మంది రైతులు పంటని కోత చేసి త్వరగా మార్కెట్ లోకి తీసుకొస్తున్నారని, దానిని నివారించడానికి మామిడి రైతులందరూ నెమ్మదిగా పక్వానికి వచ్చినటువంటి కాయలను మాత్రమే తీసుకురావాలని, ఆగస్టు మొదటి వారం వరకు చివరి కాయవరకు ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు వివిధ ఫ్యాక్టరీలలో 60 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయి. జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయని తెలిపారు, ఫ్యాక్టరీలు రాంపులు వద్ద ధరలు పట్టిక తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. మన మామిడి పంటను ఇతర రాష్ట్రాలు పంపడానికి కూడా చర్యలు చేపట్టడం జరుగుతుందని, గుజరాత్ బలగామ మార్కెట్ ప్రదేశాలలో తరలించడానికి ప్రభుత్వం అనుమతి తీసుకుని ఎగుమతి చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారుఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, మార్కెటింగ్ ఏడి పరమేశ్వరం ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా శాఖల వారీగా భక్తుల నుండి అభిప్రాయ సేకరణ

**- టిటిడి ఈవో జె. శ్యామలరావు**

**విశాలాంధ్ర -తిరుపతి :** శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానములు అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ ప్రామాణికంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టిటిడి ఈవో జె. శ్యామల రావు తెలిపారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయ సేకరణపై వివిధ విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీవారి దర్శనం, అన్నప్రసా దాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందితున్న సేవలు, లగేజీ, కళ్యాణకట్ట, వైద్యం, పారిశు ధ్యం, పరిశుభ్రత, విజిలెన్స్, ట్రాన్స్ ఫోర్ట్ తదితర అంశాలపై భక్తుల నుండి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని, భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. శ్రీ మాతృశ్రీ తరిగొండ అన్నప్రసాద భవనంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సాధ్యాసాద్యాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా క్రమపద్దతిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యం, వంట సరుకుల నాణ్యత పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి భక్తులకు మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలని కోరారు.వసతి గృహాలలో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెపక్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్.ఎమ్. ఎస్ యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భక్తుల రద్దీ సమయాలలో లడ్డూ కౌంటర్లలో భక్తులకు ఇబ్బంది లేకుండా, ఆలస్యం చేయకుండా లడ్డూలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీకి తగ్గట్టుగా లడ్డూ కౌంటర్లలో సిబ్బందిని నియమించాలన్నారు. తిరుపతి, తిరుమల ప్రాంతాలలో రవాణా వ్యవస్థ మీద విజిలెన్స్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి నిఘాను మరింత పెంచాలని , కల్యాణకట్టలో విజిలెన్స్ విభాగం, కల్యాణకట్ట విభాగాలు మరింత సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని సూచించాలన్నారు. తిరుమలలో ఉచిత బస్సుల సేవలపై భక్తులకు తెలిసేలా ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, శ్రీవారి సేవకులను నియమించి అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ ద్వారా అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తిరుపతి పరిపాలనా భవనం నుండి జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో మురలీ కృష్ణ, సీఈ టివి సత్యనారాయణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

21న కలెక్టరేట్ ఎదుట

# మామిడి రైతులు సత్యాగ్రహ దీక్షలు

**- మామిడి రైతు సంక్షేమ సంఘం నేతలు**

**విశాలాంధ్ర -చిత్తూరు:** మామిడి రైతులను ఆదుకోవడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి మాటలకు కూడా విలువ లేకుండా పోయిందని దీనికి నిరసనగా కలెక్టరేట్ వద్ద శనివారం 21తేదీ న సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘం కన్వీనర్ లు, డా. టి. జనార్ధన్,, ఎస్. ఆనంద నాయుడులు తెలిపారు. గురువారం మునీశ్వర్ రెడ్డి అధ్యక్షతన మామిడి రైతుల సంక్షేమ సంఘం కమిటీ జూమ్ మీటింగ్ నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులను గుజ్జు యజమానులు, రాంపుల నిర్వాహకులు, ఒకవైపున నరకయాతన చూపిస్తుంటే, జిల్లా యంత్రాంగం సమన్వయం చేసి హేతుబద్ధంగా క్రమబద్ధీకరించి ప్రభుత్వ నిర్ణయం అమలు చేయాల్సి ఉండగా పూర్తిగా చేతులెత్తేయడం దారుణమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వ ఉత్తర్వు మేరకు ఫ్యాక్టరీ యజమానులు గాని, రాంపుల వద్ద గాని, ధరల పట్టిక ప్రదర్శించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖాతరుచేయని , ఫ్యాక్టరీల లైసెన్సు లు రద్దు చేయమని పదేపదే విజ్ఞప్తి చేసినా అధికారులకు చెవికెక్కక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతిలో సీఎం జరిపిన సమీక్షా సమావేశంలో సైతం 12 రూపాయల ధర కచ్చితంగా మామిడి కి కల్పిస్తామని స్పష్టంచేసినా జిల్లాలో ఎక్కడా నేటికీ అమలు కాకపోవడంలో ఔచిత్యమేమిటని వారు ప్రశ్నించారు. చివరకు మామిడి ఫ్యాక్టరీల వద్ద అన్లోడింగ్ సైతం పూర్తిగా, రాజకీయ జోక్యం , మితిమీరిన పైరవీలతో , సామాన్య రైతులకు దిక్కు తోచని పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు.ప్రభుత్వం నకు చిత్తశుద్ధి వుంటే,, పల్ప్ నిల్వలను సైతం కొనుగోలు చేసి సంక్షేమ పథకాలకు అందజేయాలని,కిలో కు రూ 12 మామిడి కి ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసికోవాలని డిమాండ్ చేశారు.లేనిచో ఉద్యమం ఉధృతం చేయడం తో పాటు న్యాయ పోరాటానికి సైతం వెనకాడ బోమని హెచ్చరించారు.ఈ సమావేశం లో హరిబాబు చౌదరి, ఉమాపతినాయుడు, సంజీవ రెడ్డి, భారతి,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**విశాలాంధ్ర -తిరుపతి :** తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు మంత్రి బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చానని పేర్కొన్నారు తెలంగాణ ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని సంక్షేమ పథకాలు అమలు కావాలని కోరుకున్నట్లు తెలిపారు ఇందిరమ్మ ఇల్లులు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు ఇందిరమ్మ పక్క ఇల్లలు కట్టిస్తే 12 ఏళ్ల తెలంగాణ ప్రజలు కల నెరవేరుతుందని పేర్కొన్నారు రైతు భరోసా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రాజీవ్ ఆరోగ్యశ్రీ సన్న బియ్యం వితరణతో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన వివరించారు.

## శ్రీసిటీ సీఎఫ్ఓ నాగరాజన్‌కు పురస్కారం

**విశాలాంధ్ర-సత్యవేడు:** ఈనెల 18న ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 8వ వార్షిక బిజినెస్ వరల్డ్ ఫైనాన్స్ స్ట్రాటజీ ఎక్సలెన్స్ అవార్డులలో శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆర్.నాగరాజన్ ప్రతిష్టాత్మక 'బెస్ట్ సిఎఫ్ఓ ఇన్ స్మాల్ ఎంటర్‌ప్రైజ్' అవార్డును అందుకున్నారు.ఉత్తమ ఆర్థిక ప్రణాళిక,పనితీరుకు గాను ఆయనకు అవార్డు దక్కింది.

## అమ్మవారి సేవలో సినీనటి రీతు చౌదరి

**విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సినీనటి రీతు చౌదరి గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఆలయ సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.